

నల్లమలలో మళ్లీ మంటలు

మహానంది: గాజులపల్లె వెళ్లే మార్గంలో నల్లమల అడవిలో మంటలు వ్యాపించి వృక్ష సంపద దగ్ధమైంది. మూడు రోజుల క్రితం మహానంది ఆలయం వెనుక వైపు మంటలు చెలరేగాయి.



వైద్యం.. అధునాతనం

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తీసుకున్న చర్యలతో పేదలకు అధునాతన వైద్యం అందుతోంది. డోన్‌లోని ఆధునిక వంద పడకల ప్రభుత్వాసుపత్రి పేదల పాలిట వరంగా మారింది. 8లో▸

ఉష్ణోగ్రతలు

కనిష్టం	23.1
గరిష్టం	37.7


రంజాన్ వేళలు

	ఇఫ్తార్	సహెర్
కర్నూలు	సా॥ 6:32	ఉ॥ 5:10
ఆదోని	సా॥ 6:31	ఉ॥ 5:11
నంద్యాల	సా॥ 6:28	ఉ॥ 5:10
ఆత్మకూరు	సా॥ 6:28	ఉ॥ 5:04
బనగానపల్లె	సా॥ 6:30	ఉ॥ 5:06

హదీస్ వెలుగు :

అల్లాహ్ అనంత కరుణామయుడు, అపార కృపాశీలుడు. చేసిన పాపాల నుంచి ముక్తి కోసం, కరుణ కోసం నిత్యం దువా చేస్తూ ఉండండి.

- పవిత్ర ఖురాన్



తుంగభద్ర నదిపై ఆర్‌డీఎస్ ఆనకట్ట



ఆర్థికంగా బలంగా ఉంటేనే విద్య అభివృద్ధి చెందుతుంది. ఇది ప్రాథమిక సూత్రం. బతికేందుకే 'సుగ్గి'పోతున్న ఈ ప్రాంతంలో బడికి వెళ్లలేని దైన్యస్థితి. దీంతో అక్షరాస్యతలోనూ వెనుకబడింది. రాష్ట్రంలో విజయనగరం 58.89 శాతం అక్షరాస్యతతో చివరి స్థానంలో ఉంటే, 59.97శాతంతో కర్నూలు జిల్లా చివరి నుంచి రెండో స్థానంలో ఉంది. సంపన్న జిల్లా అయిన పశ్చిమగోదావరి అక్షరాస్యతలోనూ 74.32శాతంతో మొదటి స్థానంలోనే ఉంది. కర్నూలు జిల్లాలో 1981లో 28.73శాతం అక్షరాస్యత ఉండగా.. ఇప్పుడు 59.97 శాతానికి చేరుకుంది. అంటే 44 ఏళ్లలో 31.24 శాతం మాత్రమే అక్షరాస్యత శాతం పెరగడం గమనార్హం.

అక్షరాస్యతపై 'వెనుకబాటు' ప్రభావం

నీరుగారిన బతుకులు!

రాష్ట్రంలోనే అత్యంత పేద జిల్లా కర్నూలు

- సోషియో ఎకనమిక్ సర్వే వెల్లడి
- అత్యధిక సాగుభూమి సొంతమైనా అందని నీరు
- వర్షాధార పంటలతో ఏటా తప్పని వలసలు
- ఉపాధి, ఉద్యోగాల కల్పనకు పరిశ్రమలూ కరువే..
- అక్షరాస్యతలోనూ చివరి స్థానం
- గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రత్యేక చొరవ
- కూటమి ప్రభుత్వంలో సీమ నిర్లక్ష్యం

'సీమ'కు జలవనరుల రాజధాని 'కర్నూలు'. ఇంతటి ప్రాధాన్యత కలిగిన ప్రాంతాన్ని దశాబ్దాలుగా పాలకులు నిర్లక్ష్యం చేస్తున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాగా ఉన్నంత వరకూ ఈ ప్రభావం పెద్దగా తెలియలేదు. జిల్లాలు విడిపోయిన తర్వాత ఈ నిర్లక్ష్య ప్రభావం స్పష్టంగా తెలుస్తోంది. ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన 'సోషియో ఎకనమిక్ సర్వే'లో రాష్ట్రంలోని 26 జిల్లాల్లో కర్నూలు అత్యంత పేద జిల్లాగా చివరి స్థానంలో ఉన్నట్లు తేలింది. సాగునీటి కల్పన, పంటల సాగు, ఉత్పత్తి, అక్షరాస్యతతో పాటు చాలా రంగాల్లో ఈ ప్రాంతాన్ని నిర్లక్ష్యం చేయడమే ఇందుకు కారణం. మిగిలిన జిల్లాల్లోని పరిస్థితులను బేరీజు వేస్తే తిరిగి పేదరికం నుంచి బయటపడతామా? అభివృద్ధిలో మనుగడ సాధిస్తామా? అనే ఆందోళన కలుగుతోంది.

– సాక్షి ప్రతినిధి కర్నూలు

రాష్ట్ర ప్రభుత్వం 2024–25 ఆర్థిక సంవత్సరానికి 'సోషియో ఎకనమిక్ సర్వే' విడుదల చేసింది. ఇందులో అత్యంత ధనిక జిల్లాగా పశ్చిమ గోదావరి మొదటి స్థానంలో, అత్యంత పేద జిల్లాగా కర్నూలు చివరి స్థానంలో నిలిచాయి. నిజానికి ఈ రెండు జిల్లాల్లోని పరిస్థితిని పోల్చి చూస్తే ప్రధానంగా సాగునీటి వనరులే ప్రభావం చూపుతున్నట్లు స్పష్టమవుతోంది. కర్నూలు జిల్లాలో 12.5 లక్షల ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఇందులో 2.57లక్షల ఎకరాలకు మాత్రమే సాగునీరు అందుతోంది. పశ్చిమ గోదావరి జిల్లాలో 6.45 లక్షల ఎకరాల సాగు భూమి ఉంది. అంటే మన కంటే దాదాపు 50 శాతం తక్కువ. అయితే 4.70 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతోంది. ఆ జిల్లాలో సాగునీటి కాల్వల ద్వారా 4.12 లక్షల ఎకరాలకు మూడు పంటలకు నీరు అందుతుంటే, ఇక్కడ కేవలం 60 వేల ఎకరాలకు మాత్రమే కాలువల ద్వారా నీరు పారుతోంది. ఇదొక్క ఉదాహరణతో సాగునీటి కల్పనలో ఎంత వెనుకబడి ఉన్నామో తెలుస్తోంది. కర్నూలు జిల్లాలో బోర్ల ద్వారా 1.72లక్షల ఎకరాలు, చెరువుల ద్వారా 25వేల ఎకరాలకు నీరు అందుతుండగా.. పశ్చిమ గోదావరిలో బోర్ల ద్వారా 47వేల ఎకరాలకు మాత్రమే నీరు అందుతోంది.

ఈ దిశగా ఆలోచించరేం!

- ➤ గుండ్రేవుల ప్రాజెక్టు నిర్మిస్తే డిస్ట్రిబ్యూటరీలతో పాటు లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా ఈ ప్రాంతం మొత్తానికి తాగు, సాగునీరు అందుతుంది.
- ➤ మన జిల్లాతో పాటు కేసీ కెనాల్ ద్వారా కర్నూలు, నంద్యాల, వైఎస్సార్ జిల్లాలోని 2.65లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుంది.
- ➤ తుంగభద్ర డ్యాం నుంచి ఏటా సగటున 200 టీఎంసీలు కిందకు వెళుతున్నా ఆ నీటిని మనం వినియోగించుకోలేకపోతున్నాం.
- ➤ 20.15 టీఎంసీల సామర్థ్యంతో గుండ్రేవుల నిర్మిస్తే కనీసం వరద రోజులతో కలిపి 40 టీఎంసీలకుపైగా నీటిని వినియోగించుకోచ్చు. 4 లక్షల ఎకరాలకు సాగునీరు అందించొచ్చు.



వలస వెళ్తున్న కోసిగి గ్రామస్తులు

ఊళ్లు వదిలి..

కర్నూలు జిల్లాలో తుంగభద్ర, కృష్ణా ద్వారా సాగునీరు కల్పించే అవకాశం ఉన్నా ఆ దిశగా పాలకులు ఆలోచించని పరిస్థితి. కర్నూలు జిల్లా పాలకులు కూడా ఈ పాపంలో భాగస్వాములే. సిటీని పక్కన పెడితే ఆదోని, ఆలూరు, మంత్రాలయం, పత్తికొండ, కోడుమూరు, ఎమ్మిగనూరు నియోజకవర్గాల్లో సాగునీటి అవకాశాలు స్వల్పం. కేవలం వర్షాధారంపై ఆధారపడి మాత్రమే పంటలు సాగు చేస్తారు. వర్షాలు రాకపోతే కరువు బారిన పడాల్సిందే. బతికేందుకు 'సుగ్గిబాట' పట్టాల్సిందే. ఆదోని డివిజన్ నుంచి ఏటా లక్షల మంది బతికేందుకు కర్ణాటక, తెలంగాణ, కేరళతో పాటు కోస్తాంధ్ర ప్రాంతాలకు వెళతారంటే ఇక్కడ ఎంతటి దారుణ పరిస్థితులు ఉన్నాయో స్పష్టమవుతోంది.

ఆదోని ప్రాంత అభివృద్ధిపై దృష్టి సారించాలి



జిల్లాలో పరిశ్రమల ఊసే లేదు. ప్రజలు జీవనోపాధికి ఎక్కడెక్కడికో వలస వెళ్తున్నారు. ఇప్పటికైనా ఆదోని ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తే మంచి ఫలితాలు వస్తాయి. రాష్ట్ర మంత్రి టీజీ భరత్ ఆ ప్రాంతానికే చెందిన వారు కావడంతో పరిశ్రమల స్థాపనకు చొరవ తీసుకోవాలి. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ఏర్పాటైన ఆదోని ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ నిర్ణయాలను కొనసాగించాలి.

–విజయకుమార్‌రెడ్డి, చాంబర్ ఆఫ్ కామర్స్ జిల్లా చైర్మన్, కర్నూలు

కర్నూలుకు ఎప్పుడూ అన్యాయమే



తరతరాలుగా కర్నూలుకు తీరని అన్యాయం జరుగుతోంది. ఈ ప్రాంతం నుంచి ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి స్థాయికి ఎదిగినా జిల్లా అభివృద్ధికి నోచుకోకపోవడం బాధాకరం. వేదవతి, గుండ్రేవుల, సిద్దేశ్వరం అలుగు చేపట్టాలని కోరుతున్నా పాలకులు నిర్లక్ష్యం వీడని పరిస్థితి. విధిలేని పరిస్థితుల్లో చదువుకున్న విద్యార్థులు హైదరాబాద్, బెంగళూరు, చెన్నైలకు వలస వెళ్తున్నారు. ఓర్వకల్లును ఇండస్ట్రియల్‌హబ్‌గా తీర్చిదిద్దుతామన్న మాటకు కట్టుబడాలి.

– శ్రీనివాసరెడ్డి, ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు, కర్నూలు

కూటి కోసం కొట్లాటలు తప్పవు



పడమటి ప్రాంతంలో వ్యవసాయం జూదంగా మారింది. వర్షాలు వస్తేనే రైతులు పంటలు పండించుకునే పరిస్థితి. ఎల్‌ఎల్‌సీ, గురురాఘవేంద్ర ప్రాజెక్టులకు నీళ్లు రావడం లేదు. హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ కాలువ జిల్లా మీదుగా వెళ్తున్నా నీరందడం లేదు. దేవనకొండ, పత్తికొండ, కోసిగి, కౌతాళం మండలాల్లో సగం మంది ఊళ్లు విడిచి వలస పోవడం పరిపాటిగా మారింది. వ్యవసాయానికి సాగునీరు పెంచకపోతే కూటి కోసం భవిష్యత్‌లో కొట్లాటలు తప్పవు.

– ఎంఏ గఫూర్, మాజీ ఎమ్మెల్యే, కర్నూలు

వైఎస్ జగన్ ముందుచూపుతో 'ఆడా'

ఆదోని డివిజన్ వెనుకబాటును గత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం గుర్తించింది. ఈ ప్రాంతాన్ని 'ఆడా'(ఆదోని ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ)గా ఏర్పాటు చేస్తూ 2022 జనవరి 12న జీవో 7 విడుదల చేశారు. ఆదోని, పత్తికొండ, ఆలూరు, మంత్రాలయం, ఎమ్మిగనూరు పరిధిలోని 381 పంచాయతీలను ప్రత్యేక ఏరియాగా పరిగణించి, వీటి అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేశారు. వలసల నివారణ, అక్షరాస్యత పెంపు, పరిశ్రమల స్థాపన, ఉద్యోగాల కల్పన, సాగునీటి వనరులతో పాటు వీలైనంత వరకు అందరికీ భూమి ఉండేలా చేయాలనేది గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ సంకల్పం. ఈ మేరకు అప్పటి కలెక్టర్ కోటేశ్వరావు డీపీఆర్‌ను సిద్ధం చేసి రెండు దఫాలు అప్పటి ముఖ్యమంత్రి జగన్ సమక్షంలో సమీక్షలో పాల్గొన్నారు.

- ➤ మంత్రాలయం నియోజకవర్గంలో ఐదు ఎత్తిపోతలకు గత ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. పులికనుమ రిజర్వాయర్‌కు ఇప్పటికే తుంగభద్ర నుంచి నీటిని ఎత్తిపోస్తున్నారు. దీని పరిధిలో 3వేల ఎకరాలకు సాగునీరు అందుతోంది.
- ➤ హాల్వి, ఐరనగల్లు, కందుకూరు, కగ్గల్లు, బసాపురం ఎత్తిపోతల పనులు చేపట్టారు. పైపులు ఇతర సామగ్రి కూడా తెప్పించారు. ఇవి పూర్తయితే 10వేల ఎకరాలకు సాగునీరు, 20 గ్రామాలకు తాగునీరు అందుతుంది.
- ➤ గురురాఘవేంద్రతో పాటు దిద్ది, మాధవరం, బసలదొడ్డి, వగురూరు ఎత్తిపోతల ద్వారా సాగునీరు అందుతోంది. ఆర్‌డీఎస్, వేదవతి పూర్తయితే ఈ ప్రాంతం పూర్తి సస్యశ్యామలం అవుతుంది.
- ➤ పత్తికొండ నియోజకవర్గం లక్కసాగరం నుంచి 77 చెరువులకు సాగునీరు ఇచ్చే పథకాన్ని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించారు. పత్తికొండ, ఆలూరుతో పాటు పాణ్యం నియోజకవర్గంలోని చెరువులకు నీరు అందుతోంది.
- ➤ గాజులదిన్నె ప్రాజెక్టు సామర్థ్యాన్ని 4.5 టీఎంసీల నుంచి 5.5 టీఎంసీలకు పెంచారు. అలాగే హంద్రీ–నీవా నుంచి 3 టీఎంసీల గాజులదిన్నెకు కేటాయించారు.
- ➤ పారిశ్రామిక అభివృద్ధికి రాష్ట్ర చరిత్రలోనే అత్యంత ఎక్కువ పెట్టుబడితో 'గ్రీన్'కో స్థాపించారు. జయరాజ్ ఇస్పాత్ కూడా గత ప్రభుత్వ హయాంలోనే ఏర్పాటైంది.

న్యూస్‌రీల్

అదనపులోడు క్రమబద్ధీకరణకు 50 శాతం రాయితీ

కర్నూలు(అగ్రికల్చర్): గృహ విద్యుత్ వినియోగంలో అదనపు లోడ్‌ను క్రమబద్ధీకరించుకోవాలని విద్యుత్ శాఖ ఎస్‌ఈ ఉమాపతి తెలిపారు. గురువారం ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. గృహ వినియోగానికి సంబంధించి చాలా వరకు మొదట ఒక కిలో వాట్ లోడ్‌తోనే కనెక్షన్ తీసుకుంటారని, అయితే ఆ తర్వాత ఏసీలు, ఇతరత్రా వాటితో లోడు రెండు, మూడు కిలో వాట్స్‌కు పెరుగుతుందన్నారు. వినియోగించిన విద్యుత్‌కు వినియోగదారులు చార్జీలు చెల్లిస్తున్నప్పటికీ ట్రాన్స్‌ఫార్మర్‌పై లోడు పెరుగుతుండటం వల్ల కాలిపోవడం, లో ఓల్టేజీ, హైవోల్టేజీ సమస్యలు ఏర్పడే అవకాశం ఉందన్నారు. అదనపు లోడ్‌ను క్రమబద్ధీకరించుకుంటే ట్రాన్స్‌ఫార్మర్ సామర్థ్యంపై పూర్తి స్పష్టత వస్తుందన్నారు. అదనపు లోడు క్రమబద్ధీకరణకు డిపార్టుమెంటుకు చెల్లించాల్సిన రుసుములో 50 శాతం రాయితీతో ఏపీఎస్‌పీడీసీఎల్ వెబ్‌సైట్ www.apspdcl.on, సమీపంలోని మీ సేవ, గ్రామ, వార్డు సచివాలయాల్లో చెల్లించవచ్చని తెలిపారు. ఈ అవకాశం జూన్ 30 వరకు ఉందన్నారు.

తమ్ముళ్లా.. మజాకా!



పోనకలదిన్నెలో జేసీబీతో ఉపాధి పనులు చేస్తున్న దృశ్యం

నందవరం: తెలుగు తమ్ముళ్లు ఉపాధి కూలీల నోట్లో మట్టి కొడుతున్నారు. ఓ వైపు అధికారులు వలసల నివారణకు ఉపాధి పనులు కల్పిస్తున్నామని చెబుతుండగా.. మరో వైపు టీడీపీ నాయకులు యంత్రాలతో పనులు చేపడుతుండటం గమనార్హం. కూలి గిట్టుబాటు కాగా ఎంతో మంది పేదలు పొట్ట చేతబట్టుకుని వలసబాట పడుతున్నారు. ఊర్లో కొందరికైనా ఉపాధి కల్పించాల్సిన పనులు యంత్రాలతో చేపట్టంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పోనకలదిన్నె గ్రామంలో ఫారం పాండ్ పనులను తెలుగు దేశం పార్టీ నేతలు జేసీబీతో చేయిస్తున్నారు. గురువారం గ్రామంలోని దైవందిన్నె రోడ్డులో మూల్లా కాజావలి అనే రైతు పొలంలో జేసీబీతో చేపట్టారు. కనీసం రైతుకు సమాచారం ఇవ్వలేదని తెలుస్తోంది. ఉపాధి కూలీలకు కడుపు కొట్టి యంత్రాలతో పని చేసే వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఉపాధి కూలీలకు వాటర్ బెల్

- డ్వామా పీడీ వెంకటరమణయ్య

కర్నూలు(అగ్రికల్చర్): వేసవి ఉష్ణోగ్రతలు పెరుగుతుండటంతో ఉపాధి కూలీల విషయంలో జాగ్రత్తలు తీసుకుంటున్నామని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటరమణయ్య తెలిపారు. ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలను అమలు చేయడంపై దృష్టి సారించినట్లు పేర్కొన్నారు. ఉపాధి పనులకు ఉదయం 6 గంటలలోపే పని ప్రదేశానికి హాజరై 11 గంటలకు ముగించుకునే విధంగా ఉపాధి కూలీలకు అవగాహన కల్పిస్తామన్నారు. ఇలా చేయడం వల్ల ఎండ తీవ్రత పెరుగకముందే ఇంటికి చేరుకునే అవకాశం ఉంటుందన్నారు. అవసరమైతే సాయంత్రం 4 గంటల నుంచి 6 గంటల వరకు పనులు చేసుకొని గరిష్ఠ వేతనం రూ.300 పొందవచ్చని సూచించారు. పని ప్రదేశాల్లో కూలీలకు నీటి వసతి కల్పించాలని, ప్రతి గంటకు నీరు తాగే విధంగా వాటర్ బెల్ పద్ధతిని అమలు చేయాలని ఫీల్డ్ అసిస్టెంట్లకు ఆదేశాలు ఇచ్చామన్నారు. అధిక ఉష్ణోగ్రతల నుంచి కూలీలను కాపాడేందుకు అందుబాటులో ఉన్న షెడ్స్‌ను వినియోగించాలని, లేకపోతే స్థానికంగా లభించే తాటాకు, ఈతాకు తదితర వాటితో పందిరి వేసే విధంగా సూచించామన్నారు. పని ప్రదేశంలో ఫస్ట్ ఎయిడ్ కిట్‌తో పాటు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు కూడా అందుబాటులో ఉంచుతున్నట్లు పేర్కొన్నారు.

పరీక్షల నిర్వహణలో పొరపాట్లకు తావివ్వొద్దు

- జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా



ఉస్మానియా కళాశాలలోని పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా

కర్నూలు కల్చరల్: ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. గురువారం పరీక్షలు నిర్వహిస్తున్న ఓల్డ్‌సిటీలోని ఉస్మానియా కళాశాల పరీక్ష కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 1వ తేదీ నుంచి జిల్లా వ్యాప్తంగా 69 కేంద్రాల్లో పరీక్షలు జరుగుతున్నాయన్నారు. ప్రథమ, ద్వితీయ సంవత్సరాల ఇంటర్ విద్యార్థులు మొత్తం 45,325 మంది పరీక్షలు రాస్తున్నారన్నారు. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా సిట్టింగ్ స్క్వాడ్, ఫ్లయింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేశామన్నారు. పోలీస్ బందోబస్తు సైతం ఏర్పాటు చేశామన్నారు. ఆర్‌ఐవో గురవయ్య శెట్టి మాట్లాడుతూ గురువారం మొదటి సంవత్సరం విద్యార్థులు 25,250 మందికి 24, 495 మంది హాజరు కాగా 744 మంది గైర్హాజరయ్యారన్నారు. కర్నూలు బీక్యాంప్ ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో చూచిరాతకు పాల్పడిన ఆరుగురు విద్యార్థులను డిబార్ చేశామన్నారు.

నాదహారం.. మనోహారం



శ్రీమఠంలో రాఘవేంద్ర స్వామి జన్మదిన వేడుకలు వైభవంగా జరిగాయి. గురువారం గురుభక్తి ఉత్సవాల్లో భాగంగా రాయరు జన్మదిన వేడుకలు పీఠాధిపతి సుబుదేంద్రతీర్థులు ఆధ్వర్యంలో కనుల పండువగా సాగాయి. తమిళనాడు బృందం నాదహారం వీనుల విందుగా సాగింది. అనంతరం అశేష భక్తజన వాహిని మధ్య రాయరు బంగారు రథోత్సవం అత్యంత వైభవంగా జరిగింది.

- మంత్రాలయం



సాముహిక నాదహారంలో తమిళనాడు సంగీత కళాకారులు (ఇన్‌సెట్‌లో) రాఘవేంద్రుడి సేవలో పీఠాధిపతి

కంటైనర్‌లో వస్తారు.. ఏటీఎంలు కొల్లగొడతారు!

- హర్యానా ముఠా గుట్టు రట్టు
- చిన్నటేకూరు ఏటీఎం దోపిడీకి యత్నించింది వీరే
- సాంకేతిక పరిజ్ఞానంతో నలుగురు అరెస్టు



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

కర్నూలు: నలుగురు సభ్యుల ముఠా... అందరిదీ హర్యానా. వృత్తిరీత్యా డ్రైవర్లు కావడంతో కంటైనర్‌లో అన్ని రాష్ట్రాల్లో తిరుగుతుంటారు. మార్గమధ్యలో చోరీకి అనుకూలంగా ఉన్న ఏటీఎం కేంద్రాలను గుర్తించి దోపిడీలకు పాల్పడుతారు. ఈ అంతర్‌రాష్ట్ర ముఠా సభ్యులను కర్నూలు పోలీసులు అరెస్టు చేసి ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఎదుట హాజరుపరిచారు. డీపీఓలోని వ్యాస్ ఆడిటోరియంలో కర్నూలు డీఎస్పీ బాబుప్రసాద్‌తో కలసి ఎస్పీ విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. కల్లూరు మండలం చిన్నటేకూరు గ్రామంలో ఎన్‌హెచ్44 సర్వీస్ రోడ్డు పక్కన ఉన్న బ్యాంక్ ఆఫ్ బరోడా ఏటీఎం కేంద్రాన్ని కొల్లగొట్టేందుకు గత నెల 24వ తేదీ రాత్రి యత్నించారు. షట్టర్ పెకిలించి ఏటీఎం మిషన్‌కు తాడుతో కట్టి టోయింగ్ (వాహనాలను తరలించే) వాహనంతో లాక్కునిపోవడానికి యత్నించారు. అదే గ్రామానికి చెందిన యువకులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. యువకులు చూస్తున్నారని దొంగలు పసిగట్టి ఏటీఎం మిషన్‌ను వదిలేసి టోయింగ్ వాహనంలో అక్కడి నుంచి పారిపోయారు.

రంగంలోకి దిగిన పోలీసులు...

బ్యాంక్ మేనేజర్ ఫిర్యాదుతో నాలుగు పోలీసు బృందాలు రంగంలోకి దిగి పక్కా ఆధారాలతో హర్యానా రాష్ట్రం నూహ్‌మేవత్ జిల్లా రాయపురి గ్రామానికి చెందిన షాహిద్ ఖాన్, పాల్వాల్ జిల్లా మమ్ముల్కా గ్రామానికి చెందిన సున్ని ఇమ్రాన్ ఖాన్, మేవాత్ జిల్లా రాయపురి గ్రామానికి చెందిన జంషాద్ ఖాన్, షావ్కర్ ఖాన్‌లను చెట్లమల్లాపురం గ్రామ సమీపంలోని ఎన్‌హెచ్44 పక్కన గల సంరాతల్ రాజస్థాన్ డాబా దగ్గర అదుపులోకి తీసుకుని విచారించగా వారి నేరాల చిట్టా బయటపడింది. చిన్నటేకూరు దగ్గర బ్యాంక్ ఆఫ్ బరోడా ఏటీఎం కేంద్రంతో పాటు అంతకుముందు రోజు నాల్గవ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని యాక్సిస్ బ్యాంక్ ఏటీఎంలో కూడా తెల్లవారుజామున దొంగతనానికి ప్రయత్నించారు. అలారం మోగడంతో పారిపోయినట్లు నిందితులు విచారణలో అంగీకరించారు. దోపిడీ కోసం బళ్లారి చౌరస్తా సమీపంలో ఒక టోయింగ్ వాహనాన్ని చోరీ చేసినట్లు నిందితులు ఒప్పుకున్నారు. వీరు హర్యానా, పంజాబ్, ఢిల్లీ, ఉత్తర ప్రదేశ్ రాష్ట్రాల్లో నేరాలు చేసినట్లుగా అంగీకరించారని ఎస్పీ తెలిపారు. షాహిద్ ఖాన్‌పై 26, ఇమ్రాన్ ఖాన్‌పై 15 ఏటీఎం చోరీ కేసులు ఉన్నాయన్నారు. నిందితుల వద్ద నుంచి ఒక గ్యాస్ కట్టర్ , చిన్న గ్యాస్ సిలిండర్, రెండు కత్తులు, తాళాలు తెరవడానికి ఉపయోగించే మారు తాళాలు, మాస్కులు, గ్లౌజులు, రెండు స్ప్రే టిన్‌లు, కూలింగ్ అద్దాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ తెలిపారు.

సాంకేతిక పరిజ్ఞానంతో గుర్తింపు...

చోరీ చేసిన టోయింగ్ వాహనంపై లభించిన ఆధారాలతో పాటు ఏటీఎం కేంద్రం దగ్గర ఉన్న సీసీ టీవీ ఫుటేజీల ఆధారంగా దొంగలను గుర్తించారు. వారు వినియోగించిన సెల్‌ఫోన్ టవర్ లొకేషన్ ఆధారంగా కంటైనర్ వాహనం ద్వారా బెంగుళూరు వైపు ప్రయాణిస్తున్నట్లు గుర్తించి అరెస్టు చేశారు. సీఐలు చంద్రబాబు నాయుడు, శేషయ్య, వంశీధర్, వేణుగోపాల్, ఎస్‌ఐలు ధనుంజయ, సునిల్ తదితరులు కూడా విలేకరుల సమావేశంలో పాల్గొన్నారు.

సిబ్బందికి నగదు రివార్డు

పది రోజుల వ్యవధిలోనే ఏటీఎం చోరీ కేసును ఛేదించిన పోలీసు సిబ్బందిని నగదు రివార్డుతో ఎస్పీ సత్కరించారు. ఈ కేసులో నలుగురు దొంగలను అరెస్టు చేసిన కర్నూలు డీఎస్పీ, సీఐలతో పాటు బృందంలోని సభ్యులు డి.శేఖర్ బాబు, వాసు, షమీర్, నాగరాజు, శ్రీనివాసులు, శేఖర్, రవి, సైబర్ ల్యాబ్ పీసీ రాజేష్ తదితరులను ఎస్పీ అభినందించారు.

గురుకులాల ప్రవేశ పరీక్ష దరఖాస్తుకు గడువు పెంపు

కర్నూలు(అర్బన్): ఉమ్మడి కర్నూలు జిల్లాలోని డా.బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల / కళాశాలల్లో 5వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 13వ తేదీ వరకు గడువును పొడిగించినట్లు ఏపీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీదేవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఇన్‌స్పైర్ అవార్డులకు 9 ప్రాజెక్టులు ఎంపిక ...

2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రకటించిన ఇన్‌స్పైర్ అవార్డులకు జిల్లాలోని డా.బీఆర్ అంబేద్కర్ గురుకుల విద్యార్థులు రూపొందించిన 9 ప్రాజెక్టులు ఎంపిక అయ్యాయని డీసీఓ శ్రీదేవి తెలిపారు. అలాగే టీసీఎస్ నిర్వహించిన గ్లోబల్ ఇన్నోవేటర్ ఆఫ్ ద ఇయర్ (జీఓఐటీ) కాంపిటీషన్స్‌లో 373 ప్రాజెక్టుల్లో ఫైనల్‌కు మూడు ఎంపిక అయ్యాయన్నారు. ఇందులో కర్నూలు జిల్లాలోని దిన్నెదేవరపాడు గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థులు ఉండటం హర్షణీయమన్నారు. ఈ విద్యార్థులు ఈ నెల 25వ తేదీన వర్చువల్ ప్రజెంటేషన్ ఇవ్వాల్సి ఉంటుందని తెలిపారు.

క్లుప్తంగా

లింగ నిర్ధారణపై ప్రకటనలు ఇస్తే చర్యలు

కర్నూలు(హాస్పిటల్): లింగ నిర్ధారణకు సంబంధించి ఎలాంటి ప్రకటనలు జారీ చేసినా చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్‌వో డాక్టర్ పి. శాంతికళ గురువారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. జిల్లా పరిధిలోని ప్రైవేటు ఆసుపత్రులు, నర్సింగ్ హోమ్‌లు, డయాగ్నోస్టిక్ సెంటర్లు లింగనిర్ధారణపై వాణిజ్య ప్రకటనలు ఇవ్వకూడదన్నారు. లింగనిర్ధారణ పరీక్షలను ప్రోత్సహించేలా గోడపత్రికలు అంటించినా, హోర్డింగ్‌లు పెట్టినా, వాణిజ్య ప్రకటనలు చేసినా పీసీ అండ్ పీఎన్‌డీటీ చట్టం ప్రకారం నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామని, నిబంధనలను అతిక్రమిస్తే మూడు నుంచి ఐదేళ్ల జైలు శిక్ష, రూ.50వేల నుంచి రూ.ఒక లక్ష వరకు జరిమానా విధిస్తామన్నారు.

యువకుడి దుర్మరణం


చక్రవర్తి(ఫైల్)

నందవరం: మండల పరిధిలోని జొహరాపురం గ్రామం వద్ద గురువారం బైక్‌ను బొలెరో వాహనం ఢీకొనడంతో ఓ యువకుడు అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ఎస్‌ఐ శ్రీనివాసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. జొహరాపురం గ్రామానికి చెందిన కేసీ ఓసూరప్ప, సోమేశ్వరమ్మ దంపతుల రెండో కుమారుడు చక్రవర్తి(23) ఉదయం ఎరువుల కోసమని బైక్‌పై నాగలదిన్నెకు బయలుదేరాడు. సి.బెళగల్ మండలం పోలకల్ గ్రామానికి చెందిన బొలెరో వాహనం కందుల లోడ్‌తో కర్ణాటక రాష్ట్రం రాయచూరు మార్కెట్‌కు బయలుదేరింది. జొహరాపురం గ్రామ సమీపంలోని ప్రధాన రహదారిలో బొలెరో వాహనం అతివేగంగా బైక్‌ను ఢీకొంది. ప్రమాదంలో చక్రవర్తి అక్కడికక్కడే మృత్యువాత పడ్డాడు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం పోలీసులు ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చేతికి అందివచ్చిన కుమారుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పంట కాలువలో రైతు మృతదేహం లభ్యం

సి.బెళగల్: మండల కేంద్రంలోని తెలుగు వీధిలో నివసముండే రైతు తెలుగు రోగెన్న (52) మృతదేహం గురువారం పంట కాలువలో లభ్యమైంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. ఈనెల 3న రాత్రి రాత్రి భోజనం అనంతరం కల్లంలో ఉన్న ఎండుమిర్చి దిగుబడుల వద్దకు కాలప నిమిత్తం వెళ్లాడు. మరుసటి రోజు ఉదయం ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు తెలిసిన చోటల్లా గాలించారు. ఈక్రమంలో గురువారం ఉదయం పొలాలకు వెళ్తున్న రైతులకు కాలువలో రోగెన్న మృతదేహం కలిపించడంతో కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వారు అక్కడికి చేరుకుని బోరున విలపించారు. కాగా ఎండుమిర్చి దిగుబడుల వద్దకె కాలువపై కాలినడకన వెళ్తూ ప్రమాదశాత్తూ అందులో జారి పడి మృతి చెంది ఉంటాడని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. మృతుడికి భార్య సావిత్రమ్మ, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

బీసీ మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ

కర్నూలు(అర్బన్): వెనుకబడిన తరగతుల ఆర్థిక సహకార సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలోని బీసీ, ఈబీసీ, కమ్మ, రెడ్డి, క్షత్రియ, వైశ్య, కాపు (బలిజ) కులాల మహిళలకు టైలరింగ్‌లో ఉచితంగా శిక్షణ ఇచ్చి శిక్షణ అనంతరం కుట్టు మిషన్లు అందించనున్నట్లు బీసీ కార్పొరేషన్ ఈడీ ఎస్ జాకీర్‌హుసేన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా కులాలకు చెందిన 18 నుంచి 50 ఏళ్లలోపు వయస్సు ఉన్న మహిళలు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యర్థులు తమకు సమీపంలోని సచివాలయాల ద్వారా httpr://apobmms.apcfss.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకునేందుకు ఆధార్, రేషన్ కార్డు, మొబైల్ ఫోన్ నంబర్ కలిగి ఉండాలన్నారు. మరింత సమాచారం కోసం 9908132030 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

వైద్యం.. అధునాతనం



ఆవులదొడ్డి గ్రామానికి చెందిన ఈ వృద్ధురాలి పేరు రాములమ్మ. షుగర్, థైరాయిడ్‌తో బాధపడుతున్న ఈమెకు ఫ్రోజెన్ షోల్డర్ వ్యాధి సోకి కుడిచేయి పైకి ఎత్తలేకపోయేది. ప్రభుత్వాసుపత్రిలో ఈమెకు ఇంట్రారిటొలర్ ఇంజక్షన్ ఇవ్వడమే గాక అర్థ్రోస్కోపీ సర్జరీ ద్వారా కుడిచేతిని పైకి ఎత్తగలిగేలా చేశారు. నిరంతరం ఫిజియోథెరపీ చేయిస్తూ ఇంజక్షన్ ఇవ్వడం ద్వారా రాములమ్మ ఇప్పుడు తన పని తాను సులువుగా చేసుకుంటోంది.



డోన్ వంద పడకల ప్రభుత్వాసుపత్రి

- ప్రభుత్వాసుపత్రిలో క్లిష్ట మైన శస్త్రచికిత్సలు
- కార్పొరేట్ వైద్యం అందుతుండటంతో రోగులు ఆనందం
- గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చొరవతో పేదలకు తప్పిన కష్టాలు
- అన్నిరకాల శస్త్రచికిత్సలు త్వరలో అందుబాటులోకి

ఆస్పత్రి ప్రారంభం 2024 జనవరి 28	డైలీ ఓపీ 500	మొత్తం పడకలు 100	ఇన్‌పేషెంట్స్ 70 నుంచి 80 మంది
	ప్రతి నెల ఆపరేషన్లు 15కు పైనే		మొత్తం మేజర్ ఆపరేషన్లు 80

గత ప్రభుత్వం తీసుకున్న చర్యలతో పేదలకు అధునాతన వైద్యం అందుతోంది. జిల్లా కేంద్రానికో, ఏ ఇతర ప్రాంతాలకో వెళ్లాల్సిన అవసరం లేకుండా స్థానికంగానే అన్ని వ్యాధులకూ అత్యంత ఖరీదైన వైద్యం ఉచితంగా లభిస్తోంది. ఆరోగ్యశ్రీని ప్రవేశపెట్టి పేదల డాక్టర్‌గా వైఎస్ఆర్ పేరు పొందగా.. ఆయన బిడ్డ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అప్పటి ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి విన్నపం మేరకు రూ.40 కోట్లతో వంద పడకల ఆస్పత్రి ఏర్పాటు చేసి, వేల మందికి వైద్యం అందించి తండ్రికి తగ్గ తనయుడిగా పేరు గాంచారని డోన్ నియోజకవర్గ ప్రజలు వేనోళ్ల పొగుడుతున్నారు.

డోన్: నంద్యాల జిల్లా డోన్ పట్టణం గుత్తి రోడ్డు పక్కన ఉన్న రుద్రాక్షగుట్ట ప్రాంతంలో మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి చొరవతో రూ.40 కోట్లు వెచ్చించి అత్యంత ఆధునిక వంద పడకల ప్రభుత్వాసుపత్రిని నిర్మించారు. ప్యాపిలి, డోన్, బేతంచెర్ల, పత్తికొండ, మద్దికెర, తుగ్గలి, వెల్దుర్తి, కృష్ణగిరి, దేవనకొండ మండలాల పేదలకు ఈ ఆసుపత్రి ద్వారా వైద్య సేవలందుతున్నాయి. కర్నూలు ప్రభుత్వాసుపత్రికి వెళ్లే అవసరం లేకుండానే 80 శాతం శస్త్ర చికిత్సలను వైద్యులు ఇక్కడే చేస్తుండటంతో పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

డోన్ మండలం చింతలపేట గ్రామానికి చెందిన చంద్రుడు, రితికలకు ఆరు నెలల క్రితం కూతురు పుట్టింది. అయితే చిన్నారి వంకర పాదాలు(క్లబ్ ఫుట్)తో జన్మించడంతో దంపతులు ఆవేదన చెందారు. తమ బిడ్డను తీసుకుని డోన్ ప్రభుత్వాస్పత్రికి వెళ్లగా సూపరింటెండెంట్ డాక్టర్ హనీఫ్, ఆర్థోపెడిక్ డాక్టర్ గౌస్ పోనిశెట్టి కాస్టింగ్ టెనోటోమి చికిత్స ద్వారా వంకర కాళ్లను సరిచేశారు. డాక్టర్లు తమ బిడ్డ పాదాలు సరిచేయకపోతే జీవితాంతం వికలాంగత్వంతో బాధపడేదని, వైద్యులకు ఆజన్మాంతం తమ కుటుంబం ఋణపడి ఉంటుందని దంపతులు చంద్రుడు, రితిక దంపతులు పేర్కొన్నారు.



తుంటి ఎముక ఆపరేషన్


మద్దమ్మకు తుంటి ఎముక శస్త్ర చికిత్స చేస్తున్న వైద్యులు

చింతలపేట గ్రామానికి చెందిన మద్దమ్మను ఎద్దు పొడవడంతో నాలుగు నెలలు నాటువైద్యం చేయించుకుంది. రోగం తిరగబెట్టడంతో ప్రభుత్వాసుపత్రిలో వైద్యున్ని సంప్రదించింది. ఫ్రాక్చర్ నెక్ ఆఫ్ ఫేమూర్‌కి సిమెంటో బైపోలర్ హెమిఆర్థోప్లాస్టరీ సర్జరీ ద్వారా వైద్యులు నడవగలిలా చేశారు.

మణికట్టు వద్ద ప్లేట్ వేసి శస్త్రచికిత్స

శ్రీనివాసనగర్‌కు చెందిన నగేష్ మణికట్టు వద్ద ప్రమాదవశాత్తూ గాయం తగిలి తిరగతోడింది. దీనిని ఫ్రాక్చర్ షఫ్ట్ రాస్‌గా గుర్తించి ఆరిఫ్ విత్ ప్లాస్టింగ్ శస్త్రచికిత్స ద్వారా ప్లేట్లు విజయవంతంగా అమర్చారు. దీంతో అతను సంపూర్ణంగా కోలుకొని తన పని తాను చేసుకోగలుగుతున్నారు.

తెగిన కాలి మడిమకు చికిత్స


కాలి మడిమకు శస్త్రచికిత్స చేస్తున్న దృశ్యం

కృష్ణగిరి మండలం చిట్యాల గ్రామానికి చెందిన చంద్రకళ కట్టెలు కొడుతుండగా కుడికాలు మడిమ వద్ద నరం తెగి తీవ్ర రక్తస్రావమైంది. కొందరు డాక్టర్లు యుద్ధ ప్రాతిపదికన కుట్లు వేసి పంపించడంతో గాయం తిరగతోడింది. దీంతో ఆమె ప్రభుత్వాసుపత్రిలో వైద్యులను సంప్రదించింది. టెండో అచిలిస్ టెండర్ టియర్‌గా గుర్తించి అత్యవసర చికిత్స చేశారు.

నరాలు తెగి స్పర్శ కోల్పోయినా..


నరాలు తెగి చేతివేళ్ల స్పర్శ కోల్పోయిన యువకునికి శస్త్ర చికిత్స చేస్తున్న దృశ్యం

స్థానిక కోట్లవారిపల్లెకు చెందిన ఈడిగ సతీష్ అనే యువకునికి ప్రమాదవశాత్తూ ఎడమ అరచేతిలో గాయం కావడంతో నరాలు తెగి రెండు చేతి వేళ్లకు స్పర్శ లేకుండాపోయింది. ప్రభుత్వాసుపత్రిలో వైద్యులు సకాలంలో టెండన్ రిపేర్ అనే ప్రక్రియ ద్వారా అత్యవసర చికిత్స చేసి తిరిగి చేతివేళ్లకు స్పర్శ వచ్చేందుకు ప్రయత్నించి సఫలీకతులయ్యారు.


కోలుకున్న మద్దమ్మతో ఆసుపత్రిసూపరింటెండెంట్, ఆర్థోపెడిక్ వైద్యులు

అన్ని వ్యాధులకూ వైద్యం చేస్తున్నాం



వంద పడకల ప్రభుత్వాసుపత్రిలో అన్ని రకాల వైద్యసేవలు సామాన్య ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి. వెటర్నటీ, ఆర్థోపెడిక్, డెంటల్, ఈఎన్‌టీ తదితర విభాగాలలో ఇక్కడే వైద్యులు శస్త్రచికిత్సలు నిర్వహిస్తున్నారు. 80 శాతం రోగాలకు ఎక్కడకి వెళ్లాల్సిన అవసరం లేదు. ఇక్కడే వైద్యం అందిస్తాం.

– డాక్టర్ హనీఫ్, ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్, డోన్

నాటుసారా రహిత జిల్లాగా మారుద్దాం

- ఎక్సైజ్ నోడల్ డిప్యూటీ కమిషనర్ శ్రీదేవి

కర్నూలు: నాటుసారా రహిత జిల్లాగా మార్చడమే నవోదయం 2.0 కార్యక్రమం లక్ష్యమని, దీనికి అందరూ సహకరించాలని ఎక్సైజ్ నోడల్ డిప్యూటీ కమిషనర్ శ్రీదేవి క్షేత్రస్థాయి అధికారులను ఆదేశించారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయంలో గురువారం జిల్లాలోని ఇన్‌స్పెక్టర్లతో ఆమె నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. నాటుసారాను జిల్లాలో సమూలంగా నిర్మూలించడానికి ప్రభుత్వం నవోదయం 2.0ను ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిందన్నారు. ఇప్పటివరకు ఎన్ని గ్రామాల్లో సభలు నిర్వహించారు, ఎంతమంది పాత నేరస్థులను బైండోవర్ చేశారు, ఎన్ని గ్రామాల్లో గ్రామ కమిటీలు ఏర్పాటు చేశారు తదితర అంశాలపై సమీక్షించారు. అసిస్టెంట్ కమిషనర్ రావిపాటి హనుమంతరావు, ఎక్సైజ్ సూపరింటెండెంట్ మచ్చా సుధీర్ బాబు, అసిస్టెంట్ సూపరింటెండెంట్ రామకృష్ణారెడ్డి, ట్రైనీ ఏఈఎస్ హర్ష యశస్కర్‌తో పాటు అన్ని స్టేషన్ల సీఐలు పాల్గొన్నారు. ఎక్సైజ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్స్ అసోసియేషన్‌కు నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, ఉపాధ్యక్షులు భార్గవ రెడ్డి, రమేష్‌రెడ్డి, సందీప్, సోమశేఖర్, నవీన్ బాబు, రెహనా బేగం, కృష్ణా నాయక్, ఇందిర కిరణ్ తదితరులు డీసీని మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.


డీసీ శ్రీదేవికి పూలబొకే అందజేస్తున్న ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్స్ అసోసియేషన్ సభ్యులు

బీమా కంపెనీ వ్యాపారిపై నాన్ బెయిలబుల్ వారెంట్

కర్నూలు(సెంట్రల్): ముంబయికి చెందిన రిలయన్స్ నిప్పోన్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ కర్నూలు బ్రాంచ్ మేనేజర్‌పై జిల్లా వినియోగదారుల వ్యాజ్య పరిష్కార కమిషన్ నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. 2019 మేలో కమిషన్ రూ.4.22 లక్షలను ఓ కక్షిదారుడికి చెల్లించాలని ఆదేశాలిచ్చింది. దీనిపై ఆ కంపెనీ రాష్ట్ర కమిషన్‌ను ఆశ్రయించింది. అయితే 2022 అక్టోబర్ 13న ఆ కంపెనీ వాదనను రాష్ట్ర కమిషన్ తిరస్కరించి జిల్లా కమిషన్ తీర్పును అమలు చేయాలని ఆదేశాలు జారీచేసింది. అయితే ఇప్పటి వరకు కమిషన్ ఆదేశాలను కంపెనీ అమలు చేయకపోవడంతో గురువారం జిల్లా కిషన్ అధ్యక్షుడు కె.కిశోర్‌కుమార్, సభ్యులు ఎస్.నారాయణరెడ్డి, నజీమా కౌసర్ నాన్ బెయిలబుల్ వారెంట్‌ను జారీ చేశారు.

నకిలీ విత్తన వ్యాపారికి కూడా..

పత్తికొండకు చెందిన శ్రీవెంకటేశ్వర ట్రేడర్స్ యాజమాని డి.గంగాధర రావుపై గురువారం జిల్లా కిషన్ అధ్యక్షుడు కె.కిశోర్‌కుమార్, సభ్యులు ఎన్.నారాయణరెడ్డి, నజీమా కౌసర్ నాన్ బెయిలబుల్ వారెంట్‌ను జారీ చేశారు. ఆ వ్యాపారి ముగ్గురు రైతులకు నకిలీ విత్తనాలు అమ్మి మోసం చేశాడు. బాధిత రైతులు కమిషన్‌ను ఆశ్రయించగా 2024 జూన్ 21న రూ.70 వేలు చెల్లించాలని వ్యాపారికి కమిషన్ ఆదేశాలు ఇచ్చింది. ఇంత వరకు పరిహారం చెల్లించకపోవడంతో బాధితులు మరోసారి కమిషన్‌ను ఆశ్రయించిన నేపథ్యంలో నాన్‌బెయిలబుల్ వారెంట్‌ను జారీ చేస్తూ ఆదేశాలిచ్చారు.

పోలీసు ప్రతిష్టను పెంచేలా సేవలందించండి

- జిల్లాకు కేటాయించిన ప్రొబేషనరీ ఎస్‌ఐలకు ఎస్పీ సూచన


జిల్లాకు కేటాయించిన ప్రొబేషనరీ ఎస్‌ఐలతో ఎస్పీ విక్రాంత్ పాటిల్

కర్నూలు: విధి నిర్వహణలో నిష్పక్షపాతంగా సేవలందించి పోలీసు శాఖ పేరు ప్రతిష్టలను ఇనుమడింపజేయాలని ఎస్పీ విక్రాంత్ పాటిల్ ప్రొబేషనరీ ఎస్‌ఐలకు సూచించారు. అనంతపురం పీటీసీలో ఇటీవల శిక్షణ పూర్తి చేసుకున్న 8 మంది ప్రొబేషనరీ ఎస్‌ఐలను కర్నూలు జిల్లాకు కేటాయించారు. గురువారం వారు డీపీఓలో ఎస్పీ విక్రాంత్ పాటిల్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఎనిమిది మంది సివిల్ ఎస్‌ఐలలో ఏడుగురు పురుషులు, ఒక మహిళ ఉన్నారు. ప్రొబేషనరీ ఎస్‌ఐలను గ్రేహౌండ్స్, బెటాలియన్, సమస్యాత్మక ప్రాంతాల్లో కొన్ని నెలల పాటు విధులకు కేటాయించనున్నారు. అప్పగించిన విధులను బాధ్యతతో నిర్వర్తించి వ్యక్తిగతంగా మంచి పేరు తెచ్చుకోవడమే గాక పోలీసు ప్రతిష్టను పెంచాలని వారికి ఎస్పీ సూచించారు.

బర్త్ డే పార్టీ మిగిల్చిన విషాదం

- రోడ్డు ప్రమాదంలో సెక్యూరిటీ గార్డు మృతి


మృతిచెందిన మహేష్

కర్నూలు (హాస్పిటల్): పుట్టిన రోజు వేడుక స్నేహితుల్లో విషాదాన్ని నింపింది. విందు పూర్తి చేసుకుని తిరుగుపయణమైన స్నేహితులలో ఒకరిని రోడ్డుప్రమాదం రూపంలో మృత్యువు కబళించింది. నగర శివారు పంచలింగాల చెక్‌పోస్టు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో పెద్దాస్పత్రి సెక్యూరిటీ గార్డు కొమ్ము మహేష్ (25) మృతిచెందాడు. మహేస్‌తో పాటు విష్ణువర్ధన్, రాజేంద్రసింగ్, తిరుమలేష్ పెద్దాస్పత్రిలో సెక్యూరిటీ గార్డులుగా పని చేస్తున్నారు. విష్ణువర్ధన్ పుట్టిన రోజు కావడంతో వీరు నలుగురు గురువారం విధులకు సెలవు పెట్టి అలంపూర్‌కు వెళ్లారు. అక్కడ పుట్టిన రోజు వేడుకలు జరుపుకుని మధ్యాహ్నం ఆటోలో తిరుగు ప్రయాణమయ్యారు. పంచలింగాల చెక్‌పోస్టు సమీపంలోకి రాగానే వారి ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. తీవ్రంగా గాయపడిన నలుగురిని చికిత్స నిమిత్తం పెద్దాస్పత్రికి తరలించగా కోలుకోలేక మహేష్ మృతిచెందాడు. బంగారుపేటకు చెందిన ఇతడికి భార్య, కుమార్తె ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. కాగా క్షతగాత్రులను ఆసుపత్రి ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ డాక్టర్ సీతారామయ్య పరామర్శించారు.

రాజకీయ కక్షతో వేధిస్తే ప్రజలే తిరగబడతారు


మాట్లాడుతున్న సుభాష్ చంద్రబోస్

- కూటమి ప్రభుత్వ అక్రమ కేసులపై న్యాయస్థానాలు కలుగజేసుకోవాలి
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మద్దూరు సుభాష్ చంద్రబోస్, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు సీనియర్ న్యాయవాది ఎం.సుబ్బయ్య


కర్నూలు (అర్బన్): రాజకీయ కక్షతో వేధిస్తే ప్రజలే తిరగబడతారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, సీనియర్ న్యాయవాది మద్దూరు సుభాష్ చంద్రబోస్, కర్నూలు జిల్లా బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు, సీనియర్ న్యాయవాది ఎం.సుబ్బయ్య కూటమి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. గురువారం బడుగు, బలహీనవర్గాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో స్థానిక యునైటెడ్ క్లబ్‌లో 'ఒకే అంశం – వివిధ పోలీస్ స్టేషన్లలో కేసులు సమంజసమా' అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. వేదిక కన్వీనర్లు, న్యాయవాదులు శేఖర్, శివ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో సుభాష్ చంద్రబోస్, సుబ్బయ్య మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చేస్తున్న రాజకీయ కక్షపూరిత తప్పుడు కేసులపై హైకోర్టు, సుప్రీం కోర్టు కలుగజేసుకుని బాధితులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. ఎవరైనా తప్పు చేసి ఉంటే చట్టం ప్రకారం ఒక కేసు నమోదు చేసి భారత రాజ్యాంగం, న్యాయ వ్యవస్థలోని చట్టాల ప్రకారం నడుచుకోవాలని డిమాండ్ చేశారు. అలా గాకుండా అధికారం ఉంది కదా అని రాజకీయ కక్షతో ఒకే అంశంపై రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల్లో 15, 20 కేసులు పెట్టి బాధిత కుటుంబాలను వేధిస్తూ పోలీస్ వ్యవస్థను భ్రష్టు పట్టిస్తున్నారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వ తప్పుడు కేసులపై జిల్లా వ్యాప్తంగా మేధావుల సదస్సులు నిర్వహిస్తామన్నారు. సమావేశంలో న్యాయవాదులు రాజేష్, బంగి సుధీర్, ఉపేంద్రనాథ్, బోయ వెంకటేశ్వర్లు, బాలాజీ రెడ్డి, అబ్దుల్లా సాహెబ్, వెంకట కిషోర్, కిరీటి, విద్యావేత్తలు బోయ అర్జున్, శ్రీరాం పాల్గొన్నారు.

బనగానపల్లెలో భారీ చోరీ

బనగానపల్లె రూరల్: పట్టణంలోని శివరామ్ టాకీస్ సమీపంలో నివాసం ఉంటున్న సత్యనారాయణ ఇంట్లో గుర్తు తెలియని దుండగులు చొరబడి 16 తులాల బంగారం, రెండు కేజీ వెండి ఆభరణాలతోపాటు రూ.4 లక్షల నగదుతో ఉడాయించారు. బాధితుడు తెలిపిన వివరాలు.. సత్యనారాయణ కుటుంబం రెండు రోజు క్రితం ఇంటికి తాళం వేసి తిరుపతికి వెళ్లారు. బుధవారం అర్ధరాత్రి గుర్తు తెలియని దొంగలు ఇంటి తాళం పగలగొట్టి లోపలకు ప్రవేశించి, బీరువాలో ఉన్న బంగారు, ఆభరణాలు, నగదును మూటగట్టుకుని పరారయ్యారు. ఇంటి తలుపులు తెరిచి ఉంచినట్లు స్థానికుల ద్వారా తెలుసుకున్న సత్యనారాయణ తిరిగి ఇంటికి వచ్చి చోరీ జరిగినట్లు నిర్ధారించుకుని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. నంద్యాల క్లూస్ టీం బృందం చోరీ జరిగిన ఇంటిని పరిశీలించి, వేలిముద్రలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

భర్త చేతిలో భార్య దారుణ హత్య

- రోకలి బండతో తలపై దాడి
- ఆసుపత్రికి తీసుకెళ్తుండగా మృతి


మనోహరమ్మ(ఫైల్)

కొలిమిగుండ్ల: జీవితాంతం తోడుంటానని బాస చేసిన భర్తే భార్యను కర్కషంగా హత్య చేశాడు. ఈ ఘటన గురువారం బెలుం శింగవరంలో చోటుచేసుకుంది. సీఐ రమేష్‌బాబు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన బిజ్జం చిన్న వెంకట్రామిరెడ్డి, మనోహరమ్మ(37)కు 20 ఏళ్ల క్రితం వివాహమైంది. 13 ఏళ్ల కుమారుడు ప్రతాప్‌రెడ్డి ఉన్నాడు. వీరి స్వగ్రామం వైఎస్సార్ కడప జిల్లా కొండసుంకేసుల కాగా బెలుం శింగవరంలో స్థిరపడ్డారు. మొదట్లో నాపరాతి గని తీసుకొని జీవనం సాగిస్తుండేవాడు. తర్వాత మద్యానికి బానిసై, భార్యపై అనుమానం పెంచుకున్నాడు. భార్య వ్యవసాయ కూలీ పనులకెళ్లి కుటుంబాన్ని పోషిస్తుండేది. రోజు మాదిరిగా కూలీ పనులు ముగించుకుని ఇంటికి చేరుకొని కాళ్లు, ముఖం శుభ్రం చేసుకుని ఇంట్లోకి వెళ్లగానే తలుపులు మూసి.. అప్పటికే పథకం ప్రకారం సిద్ధంగా ఉంచుకున్న రోకలిబండతో తలపై కొట్టడంతో తీవ్ర రక్తస్రావమై కుప్పకూలిపోయింది. స్థానికుల సాయంతో బంధువులు చికిత్స నిమిత్తం అవుకు సీహెచ్‌సీకి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యుల సూచన మేరకు కర్నూలుకు తీసుకెళ్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందింది. ఆళ్లగడ్డ డీఎస్పీ ప్రమోద్ బెలుం శింగవరం చేరుకొని ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు సీఐ తెలిపారు.

సేవల జాప్యం.. తీసింది ప్రాణం

- బ్యాంక్ కార్యాలయ మెట్లు ఎక్కలేక గర్భిణికి రక్తస్రావం
- ఖాతాలో పేరు మార్పునకు జాప్యం
- పురిటిలోనే మృతి చెందిన మగశిశువు


ఆటోలో గర్భిణిని తరలిస్తున్న దృశ్యం

కోసిగి: బ్యాంకు సిబ్బంది కాలయాపనతో ఓ మహిళ పురిటిలోనే తన బిడ్డను కోల్పోవాల్సి వచ్చింది. ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించాల్సిన బ్యాంకుల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయనేందుకు ఈ ఘటనే నిదర్శనం. బాధితురాలి కుటుంబీకులు తెలిపిన వివరాల మేరకు.. మండల కేంద్రం కోసిగిలో 6వ వార్డులో నివాసం ఉంటున్న జాలిమంచి సురేష్ భార్య అంజలి నిండు గర్భిణి. ప్రసవం నిమిత్తం ఆమె పుట్టినిల్లు వందగల్లు గ్రామంలో ఉంటుంది. అయితే ఆమె బ్యాంక్ ఖాతా స్టేట్ బ్యాంక్‌లో ఉంది. పెళ్లియినా తర్వాత పుట్టింటి నుంచి మెట్టింటికి రావడంతో పేరు మార్పు చేసుకోవాల్సి ఉంది. పేరు మార్పు కోసం నెల రోజులుగా బ్యాంక్ అధికారులు కాలయాపన చేస్తూ తిప్పుతూ ఉన్నారు. ఈ బ్యాంక్ కార్యాలయం ఓ భవనంపై రెండో అంతస్తులో ఉండటంతో మెట్లు ఎక్కిదిగ లేక అవస్థలు పడుతుండేది. గురువారం ఆమె బ్యాంక్ మెట్లు ఎక్కి కొద్ది సేపటికే రక్త స్రావం కావడంతో వెంటనే అప్రమత్తమై అక్కడి నుంచి ఆటోలో కోసిగి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షలు చేసి పరిస్థితి విషమంగా ఉండటంతో 108 అంబులెన్స్‌లో ఆదోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. కాగా అప్పటికే తల్లి పురిటిలోనే మగ బిడ్డ చనిపోయినట్లు నిర్ధారించడంతో అంజలి, ఆమె కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు. బ్యాంక్ సిబ్బంది నిర్లక్ష్యమే ఇందుకు కారణమని వాపోయారు. కోసిగి స్టేట్ బ్యాంక్ బ్రాంచ్ కార్యాలయం రెండవ అంతస్తులో ఉండడంతో గర్భిణులు, వృద్ధులు, వికలాంగులు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

PLOT FOR SALE

■ సెంటు 2 లక్షలకే KUDA అప్రూవ్డ్ ప్లాట్లు 30x50,30x44 వెల్దుర్తి డోన్ రోడ్ కర్నూల్ నందు చిన్న పెట్టుబడితో పెద్ద లాభాలు ✆ 77028 05174 [C-820365]

WANTED

■ ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ నందు పనిచేయుటకు క్యాషియరు లేడి టెలికాలర్స్ కావలెను. సంప్రదించండి: ✆ 6281183283. [L-1259468]

■ కన్‌స్ట్రక్షన్ సర్వీసెస్ కంపెనీలో పనిచేయుటకు 10th, ఇంటర్, డిగ్రీ, ITI ఉన్న వారు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ టెలికాలర్స్, ఎలక్ట్రీషియన్, ప్లంబర్ కావలెను. సంప్ర: 9491144481. [L-783111]

■ సంతోష్ పాలిమర్స్, కల్లూరు ఎస్టేట్, కర్నూలు నందు పని చేయుటకు సేల్స్‌మేన్ కావలెను. అర్హత: ఇంటర్/డిగ్రీ. సంప్ర: 9032222730. [L-779068]

■ Wisdom అకాడమి నందు పనిచేయుటకు లేడీ టెలికాలర్స్ కావలెను. జీతం+ఇన్సెంటివ్స్. సంప్ర: మెడికల్ కాలేజీ ఎదురుగా, కర్నూలు. ✆ 9177177289, 8919300841. [L-779067]

■ సెక్యూరిటీ గార్డ్స్ కావలెను అడ్రస్: ఓర్వకల్లు మండలం కాల్వ బుగ్గ శివాలయం టెంపుల్ ప్రక్కన. అర్హత: 10th పాస్, జీతం:15,220 (26రోజులు), రూమ్, భోజనం ఫ్రీ, డ్యూటీ టైం: 8 గంటలు, వయసు: 19 to 45 సం॥. ప్రతి 6 నెలలకు ఒకసారి జీతం పెంచబడుతుంది. సంప్ర: 9652996521, 8106184820. [L-1259466]

■ SOUTH CENTER: Wedding Shopping Mall. Saree Experience Sales man, Saree Experience Sales women, Wanted Sales Man & Women. Helpers. Contact: Abdullah Khan Estate, Kurnool. ✆ 89853 59900. [L-779069]

■ మీ ఇంటి వద్దనే ఉంటూ మీ మొబైల్ ద్వారా ప్రతి రోజు 50 మెసేజ్‌లు పంపుతూ వారానికి 3,500 సంపాదించుకోండి. వివరాలకు వాట్సాప్‌లో Hi అని మేసేజ్‌చేసి కాల్ చేయండి. ✆ 82478 08801. [SCA25001941]

■ HYD- రియల్ ఎస్టేట్ Co.కై మార్కెటింగ్ Exe. కావలెను, కోకాపేట్, శంకర్‌పల్లిలో విల్లాస్/ప్లాట్స్ సేల్స్‌కై జీ+కమీ+ 2వీలర్+రూం+భో-ఫ్రీ,age:34,నె.లక్ష రూ.ఫ్రెష్/Exp.7416396781 [HA-16497]

■ కన్సల్టెన్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు, ఆయా, నర్సులు, వంట వారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ: 15 వేలు – 40వేలు,ఫ్రీ రూం+భోజనం. HYD. 9347197693 [HA-99983]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడ మైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

